
సిద్దిపేట బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు కిక్కిరిసిన ప్రయాణికులు

పండుగకు ప్రత్యేక బస్సులు

- అదనంగా 26 ట్రిప్పులు

సిద్దిపేట అర్బన్, జనవరి 13 : సంక్రాంతి పండుగకు వరుస సెలవులు రావడంతో పట్టణాలలో ఉన్నవారు తమ సొంత గ్రామాలకు, గ్రామాల్లో ఉన్నవారు పట్టణాలకు ప్రయాణం చేస్తుంటారు. దీంతో సంక్రాంతికి ముందు సంక్రాంతికి తర్వాత రెండు రోజులపాటు ప్రయాణికులు తాకిడి విపరీతంగా ఉంటుంది. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిద్దిపేట ఆర్టీసీ డిపోలో రోజువారి కంటే 26 అదనపు ట్రిప్పులను నడుపుతున్నారు. నాలుగు రోజులపాటు ఈ అదనపు ట్రిప్పులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రోజువారి ఆదాయం కంటే ఈ నాలుగు రోజులపాటు ఆర్టీసీకి రూ.ఐదు లక్షల అదనపు ఆదాయం వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ రూట్‌లో 10 ట్రిప్పులు, సిద్దిపేట నుంచి వేములవాడ రూట్‌లో ఆరు ట్రిప్పులను అదనంగా నడుపుతున్నారు. ఆర్టీసీ ప్రయాణాన్ని ఉపయోగించుకొని ప్రయాణికులు సురక్షిత ప్రయాణాన్ని కొనసాగించాలని ఆర్టీసీ సిబ్బంది సూచిస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు రోజుల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

పండుగను పురస్కరించుకొని వివిధ రూట్లో ప్రయాణించే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రోజువారి బస్సుల కంటే మరో 26 ట్రిప్పులను అదనంగా ఏర్పాటు చేశాం. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఇబ్బందులకు గురికాకుండా సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలి. రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆర్టీసీ సిబ్బంది పట్ల సంయమనం పాటించాలి.

- సుఖేందర్‌రెడ్డి, సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్

సంబరాల సంక్రాంతి

- పల్లెలు, పట్టణాల్లో పండుగ శోభ
- ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు
- నేడు భోగి పండుగ.. రేపు సంక్రాంతి
- ఊరూవాడా నెలకొన్న సందడి

కొండపాక, జనవరి 13 : పల్లెలు, పట్టణాలకు సంక్రాంతి పండుగ శోభ వచ్చేసింది. ఊరువాడ పండుగ సందడి మొదలైంది. ఇంటింటా పిండివంటలు ఘుమఘుమలు ఆహా అనిపిస్తున్నాయి. సకినాలు, అరెసలు, లడ్డూలు వంటి రకరకాల పిండివంటల తయారీలో మహిళలు బిజీబిజీగా ఉన్నారు. ఊరువాడ భోగి, సంక్రాంతి, కనుమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆదివారం భోగి పండుగను జరుపుకోనున్నారు. దీంతో మార్కెట్లు రద్దీగా మారాయి. రంగులు, గరిక, పేడ, రేగుపండ్లు కొనుగోలు చేస్తున్నారు.




గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తాలో అమ్ముతున్న రంగులు

మూడు రోజుల పాటు సంబురం

గంగిరెద్దుల విన్యాసాలు, రంగురంగుల ముగ్గుల లోగిళ్లు, గొబ్బెమ్మలు, భోగి పళ్లు, పిండి వంటలు, పతంగులు, భోగిమంటల సంబురం సంక్రాంతి. మొదటి రోజు భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. సంవత్సరాన్ని రెండు ఆయనములుగా మనం విభజించుకుంటున్నాం. కటక సంక్రమణం నుంచి మకర సంక్రమణం వరకు దక్షిణాయనంగా, మకర సంక్రమణం నుంచి కటక సంక్రమణం వరకు ఉత్తరాయణంగా పరిగణిస్తారు. ఉత్తరాయణం దేవతా పూజకు, దక్షిణాయనం పితృదేవతారాధనకు ప్రధానం. ఉత్తరాయణం ప్రారంభమయ్యే మకర సంక్రాంతి నుంచి ప్రకృతి రమణీయంగా ఉంటుంది. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు చేరుకుంటాయి. పశుపక్ష్యాదులు ఆనందంగా కనిపిస్తాయి. మూడు రోజుల పండుగలలో మొదటి రోజు కట్టెలను, పిడకలను కాల్చి భోగి మంట వేస్తారు. ఈ మంటలో మనలోని అసూయ, ద్వేషాన్ని వేసి, వెలుతురు అనే జ్ఞానాన్ని పొందాలనేది ఇందులో తాత్త్వికాంశం. సాయంత్రం వేళ చిన్న పిల్లలకు భోగిపళ్లు పోస్తారు. రెండో రోజు మకర సంక్రాంతి పర్వదినం. గృహస్థులు మకర సంక్రాంతి రోజున ఇంటి మధ్య చుట్టూ నాలుగు పిడతలను, మధ్యలో ఒక పిడత, చిన్న కుండ పెట్టి, అందులో ఆవు పాలు పోసి పొంగే దాకా కింద ఆవు పిడకలతో మండిస్తారు. పాలు పొంగినట్టు సిరి సంపదలు పొంగిపొర్లాలని ధాన్యలక్ష్మిని ప్రార్థిస్తారు. మూడో రోజు కనుమ పండుగ నాడు మహిళలు పసుపు బొట్టు పంపిణీ చేసుకుంటారు.

రంగవల్లులు.. గొబ్బెమ్మలు

సంక్రాంతి అంటే ఇళ్ల వాకిళ్లల్లో రంగురంగుల ముగ్గులు సరికొత్త అందాన్ని తెచ్చిపెడుతాయి. గృహిణులు, యువతులు ముగ్గులు వేయడానికి పోటీపడతారు. ముగ్గుల మధ్యలో పెట్టే గొబ్బెమ్మలు ప్రత్యేకం. గొబ్బెమ్మలను పేడతో తయారు చేసి వాటిని పసుపు, కుంకుమ, గరిక, పిండి పూతలతో అలంకరిస్తారు. ముగ్గుల మధ్య ఉంచి పువ్వులు, నవ ధాన్యాలు, రేగు పండ్లను వేస్తారు.



ఆటోడ్రైవర్లే సిద్దిపేట బ్రాండ్ అంబాసిడర్లు

- మీ ఆరోగ్యానికి, పిల్లల చదువులకు నేను అండగా ఉంటా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 13 : సిద్దిపేటకు ఆటోడ్రైవర్లే బ్రాండ్ అంబాసిడర్లని, పట్టణానికి వచ్చే అతిథులను గౌరవ మర్యాదలతో గమ్యాలకు చేరుస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం రాష్ట్రానికే ఆదర్శమన్నారు. 1480 మంది ఆటోడ్రైవర్లు ఈ సొసైటీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు మంచి కార్యక్రమైనా, ఒకరికి మంచి చేయడానికి ఇంకొకరి కడుపు కొట్టొద్దని సూచించారు. చాలా గ్రామాల్లో బస్సు సౌకర్యం లేదని, రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని బస్సులను పెంచాలన్నారు. ఆటో డ్రైవర్లు నిత్యం బిజీ ఉంటూ వారి ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదని, ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యంతో పాటు, శారీరక మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఆటోడ్రైవర్ల ఆరోగ్యానికి, పిల్లల చదువులకు తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సిద్దిపేట మినీ స్టేడియం స్పోర్ట్స్ హబ్‌గా మారిందన్నారు. సిద్దిపేట పట్టణంలోని ముర్షద్‌గడ్డ దర్గా ఉర్సు ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొనగా ఆయనను మత పెద్దలు ఆశీర్వదించారు.

అయోధ్యకు అన్నదాన వాహనాలను ప్రారంభించిన హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, జనవరి 13 : మంచు కొండల్లోనే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ దక్షిణ భారతదేశం నుంచి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంలో సిద్దిపేట ఎల్లలు దాటిందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో అయోధ్యకు వెళ్లే అన్నదాన వాహనాలను సిద్దిపేట వెంకటేశ్వరాలయం వద్ద ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో వినూత్న కార్యక్రమాలకు సిద్దిపేట నాంది పలుకుతుందన్నారు. అన్నదాన కార్యక్రమాల్లో అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ముందుండడం గర్వకారణమన్నారు.



అయోధ్యకు వెళ్లే అన్నదాన వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


గాలిపటాన్ని ఎగురవేస్తున్న హరీశ్‌రావు


కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కోమటిచెరువు నెక్లెస్ రోడ్డులో పతంగుల పండుగ సందడి

పతంగులకు దారం.. పిల్లలకు తల్లిదండ్రులు ఆధారం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- కోమటిచెరువు నెక్లెస్ రోడ్డులో కైట్ ఫెస్టివల్ ప్రారంభం

సిద్దిపేట టౌన్, జనవరి 13 : పతంగులకు దారం ఆధారమైతే, పిల్లలకు తల్లిదండ్రులు ఆధారమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు, నెక్లెస్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కైట్ ఫెస్టివల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రజలు, యువతీయువకులతో కలిసి హరీశ్‌రావు పతంగులను ఎగురవేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను తెలిపారు. పతంగుల పండగ అంటే ఆనందం, ఆహ్లాదంతో పాటు సూర్యరశ్మి ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుతుందని చెప్పారు. కోమటిచెరువుపై మూడు రోజుల పాటు కన్నులపండుగగా పతంగుల పండగ జరుగుతుందని ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. మకర సంక్రాంతి అనేది శీతాకాలపు అధికారిక ముగింపని తెలిపారు. వివిధ రంగుల గాలిపటాల అందమైన సమ్మేళనంలో పాల్గొని కనులారా వీక్షించాలన్నారు. దీంతో ఆ సూర్య కిరణాలు మనపై పడితే ఉచితంగా విటమిన్-డి లభిస్తుందని వివరించారు. సంక్రాంతి పండుగలో బెల్లం, నువ్వుల గింజలతో లడ్డులు తయారు చేస్తారని, ఇది శరీరాన్ని వేడి చేస్తుందని తెలిపారు. పూర్వకాలంలో అంటువ్యాధులు, క్రిములు మొదలైన వాటిని నివారించడానికి సూర్యుని కిరణాల మనపై ఉంచేలా అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం శీతాకాల రోజులు గడిపేవారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల సాయిరాం, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, రెబల్ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొండపోచమ్మ జాతరకు భారీ బందోబస్తు ఏర్పాటు

జగదేవ్‌పూర్, జనవరి 13 : ఈ నెల 22 నుంచి జరగనున్న కొండపోచమ్మ బ్రహ్మోత్సవాలకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొండ పోచమ్మ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు మూడు చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ట్రాఫిక్ లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయొద్దని కోరారు. జాతర ముగిసే వరకు ఆలయం వద్ద ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్, సర్పంచ్ రజితరమేష్, ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.


కొండపోచమ్మ వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్


కొమురెల్లిలో వసతి గదుల ప్రారంభంపై నిర్లక్ష్యం

- గత వారమే దేవాదాయశాఖ మంత్రితో ప్రారంభానికి శిలాఫలకం ఏర్పాటు
- మల్లన్న కల్యాణం రోజున కాన్వాయ్ నిర్వహణ తప్పిదంతో వాయిదా


నిర్మాణం పూర్తయిన 16గదుల శివసదన భవనం

చేర్యాల, జనవరి 13 : కొమురవెల్లి మల్లన్న ఆలయాధికారుల నిర్లక్ష్యం, పునరుద్ధరణ కమిటీ సభ్యుల అవగాహన లోపంతో 16 వసతి గదులు ప్రారంభానికి నోచుకోలేదు. గత ఆదివారం జరిగిన మల్లన్న కల్యాణం రోజున దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో ప్రారంభించేందుకు సన్నాహకాలు చేపట్టి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు, ఆలయాధికారుల సమన్వయలోపంతో నిలిచిపోయింది. తద్వారా భక్తులకు అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించినా నిరుపయోగంగా మారాయి.

మల్లన్న దర్శనంకోసం వచ్చే భక్తులకు బస కల్పించడానికి ఆలయ పరిధిలో కేతలమ్మ బ్లాక్‌లో 76, మల్లికార్జున బ్లాక్‌లో 21, మేడలమ్మ బ్లాక్‌లో 50 గదులుండగా, వీటిలో పలు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్నింటిని ఆలయ పాలనకు వినియోగిస్తున్నారు. వంద వరకు గదులను అద్దెకు ఇస్తున్నారు. ఇవన్నీ భక్తులు కట్టించి ఇచ్చినవే. దేవాలయ నిధులతో వసతి గదులను నిర్మించాలని కొన్నాళ్ల క్రితం ఆలయ వర్గాలు నిర్ణయించాయి. వైశ్యసత్ర ఆవరణలోని ఆలయ స్థలంలో ముందస్తుగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ చేపట్టడంతో గతేడాది మే 5న అప్పటిమంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతులమీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ పాలకమండలి పదవీకాలం ముగియనుండటంతో అప్పటి చైర్మన్ గీస భిక్షపతి చేతులమీదుగా ప్రారంభింపచేశారు. అనంతరం మొదటి, రెండో అంతస్తులో రూ.1.32కోట్లతో 16వసతి గదుల నిర్మాణం పనులు పూర్తి చేయడంతో శివసదనంగా నామకరణం చేశారు. ఏడో తేదీన జరిగిన స్వామివారి కల్యాణానంతరం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ పోలీసు, భద్రత అధికారుల నిర్లక్ష్యంతో కాన్వాయ్ నిర్వహణలో జరిగిన తప్పిదంతో అసహనం వ్యక్తంచేస్తూ మంత్రి కొండా సురేఖ సొంత వాహనంలో పార్కింగ్ ప్రదేశం నుంచి ఆలయ గెస్ట్‌హౌజ్‌కు వెళ్లిపోయారు. దీంతో ప్రారంభోత్సవంపై అధికారులు కిమ్మనలేదు. తన కూతురు సుస్మిత పటేల్‌తో కలిసి పట్నంవేసి మొక్కులు తీర్చుకున్న మంత్రి చాలాసేపటి వరకు ఉన్నప్పటికీ వసతిగదుల ప్రారంభ విషయాన్ని ప్రస్తావించలేదు. దీంతో సదరు వసతి గదుల నిలిచిపోవడంతో భక్తులకు కూడా అందించడం లేదు. వచ్చే ఆదివారం నుంచి జాతర ప్రారంభం కానుండటంతో భక్తులకు తిప్పలు తప్పని పరిస్థితి ఉంది. ఈ విషయమై ఆలయాధికారులతో పాటు పునరుద్ధరణ కమిటీ సభ్యులు ఆలోచించాల్సిన అవసరముంది.



ఏర్పాటు చేసిన శిలాఫలకం

పునరుద్ధరణ కమిటీ సమావేశం

- ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించకూడదని కొమ్మూరి సూచన

చేర్యాల, జనవరి 13 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం పునరుద్ధరణ కమిటీ సమావేశం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా భక్తుల వసతుల కల్పన, ఆలయాభివృద్ధి పనుల ప్రతిపాదనలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. డోనార్ స్కీం ద్వారా 100 గదుల ధర్మశాల, దేవాలయ, జాతర ప్రదేశాలలో ఏడు సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదన పంపించాలని నిర్ణయించారు. జాతర పార్కింగ్ స్థలాలలో పూర్తిస్థాయి లైటింగ్, పారిశుధ్య చర్యలు ముమ్మరంగా నిర్వహించాలని, వసతి గదులు, దర్శనం, ప్రసాదాలు, శెల్లాలు దుర్వినియోగం చేయకూడదని అధికారులను ఆదేశించారు. నాయీబ్రాహ్మణులకు డ్రెస్‌కోడ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి గుర్తింపుకార్డుల జారీ, మహామండపంలో హుండీలు, ఇ-హుండీ, విరాళాల సేకరణకు క్యూఆర్ కోడ్ స్కానర్ల ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు, పునరుద్ధరణ కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పాటుపడాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సమీక్షా సమావేశానికి ముందు ఆయన ఆలయాధికారులు, సిబ్బంది, ఒగ్గు పూజారులు, నాయీబ్రాహ్మణులతో మాట్లాడి జాతర నిర్వహణతో పాటు విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆలయంలో చాన్నాళ్ల కాలంగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం కల్పించనున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన వివరాల నివేదిక అందించాలని ఆలయాధికారులకు సూచించారు. నాయీబ్రాహ్మణులు మద్యం సేవించి విధులు నిర్వహించకూడదని, తలనీలాల సేకరణలో భక్తుల నుంచి డబ్బు డిమాండ్ చేయకూడదని తెలిపారు. పట్నాలు వేసే భక్తుల నుంచి ఒగ్గుపూజారులు అక్రమ వసూళ్లు చేయకూడదని, ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలు ఎవరూ చేపట్టకూడదని సూచించారు. పునరుద్ధరణ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం 50గదుల సత్రం భవన నిర్మాణం పనులు పరిశీలించారు. త్వరిత గతిన పనులు పూర్తిచేసి ఈ జాతరలోగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ డైరెక్టర్లతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఏపీజీవీబీ మేనేజర్



గౌరారంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం

వర్గల్, జనవరి 13 : వర్గల్ మండలం గౌరారంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలపై గౌరారం ఏపీజీవీబీ మేనేజర్ నర్సింహులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం సురక్ష, పీఎం జీవన్ జ్యోతి, అటల్‌పెన్షన్, ఆరోగ్యశ్రీ, ఆవాస్ యోజన, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి, ఆరోగ్య సేవలు, గ్యాస్ ఉజ్వల్ యోజన, వ్యవసాయానికి సంబంధించిన పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పంపించిన 2024 సంవత్సరం క్యాలెండర్, బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినోద నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మరం మహిపాల్ యాదవ్, మహిళా సంఘం సీసీ పద్మలత, గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


● వర్గల్ మండలం మజీద్‌పల్లిలో ఘటన



గాలం జంపులు(ఫైల్)

వర్గల్, జనవరి 13 : ప్రమాదవశాత్తు బావిలో పడి వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకున్నది. బేగంపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మజీద్‌పల్లికి చెందిన గాలం జంపులు(55) మేస్త్రీపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటివద్ద నిద్రించగా అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం ఇంటి సమీపంలో ఉన్న బావి వద్దకు వెళ్లగా ప్రమాదవశ్యాత్తు బావిలో జారి పడి మృతి చెందాడు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి బలవన్మరణం



మృతి చెందిన రమేష్

సిద్దిపేట అర్బన్, జనవరి 13 : సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల గ్రామానికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బక్రీ చెప్యాల గ్రామానికి చెందిన రమేష్ (36) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో పొన్నాల సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులకు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

అందని పాల బిల్లు.. ఆందోళనలో పాడి రైతులు

మద్దూరు, జనవరి 13 : మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామ విజయ డైరీ పాల కేంద్రం రైతులకు ఒకటిన్నర నెలలుగా పాలబిల్లు అందకుండా పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పాడి రైతులు శనివారం స్థానిక విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పదిహేను రోజులకోమారు పాలబిల్లు చెల్లించే వారని , ప్రస్తుతం పాలబిల్లు చెల్లించక నెల పదిహేను రోజులు దాటిందని సంక్రాంతి పండుగ వచ్చినా పాల బిల్లు అందించకపోవడంతో ఆందోళనగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల పాలల్లో ఉప్పు కలుస్తోందని కేంద్రం నుంచి అన్ని పరీక్షలు నిర్వహించి తీసుకెళ్లిన పాలను తిరస్కరించి పారబోయడంతో పాటు పాలను తీసుకోవడానికి నిరాకరించిన సందర్భంగా చేసిన ధర్నా మేరకు చేర్యాల పాలకేంద్రం మేనేజర్ స్పందించారన్నారు. అయితే ప్రతీ 15 రోజులకోమారు చెల్లించే పాల బిల్లు ఇంకా అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని పాల బిల్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ సిద్దిపేట అర్బన్ మండల మహిళా అధ్యక్షురాలిగా రూప

సిద్దిపేట అర్బన్,జనవరి 13: సిద్దిపేట అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామానికి చెందిన నరాల రూపను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి శనివారం తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన రూప మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుతానని తెలిపారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం



సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రియా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో... మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారు జామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి.. పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

● డీడీఎస్ జాయింట్ డైరెక్టర్ గిరిధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఎస్ జాతర నిర్వాహకులు

జహీరాబాద్, జనవరి 13: చిరుధాన్యాల సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని డీడీఎస్ జాయింట్ డైరెక్టర్ గిరిధర్‌బాబు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 12వరకు డీడీఎస్ ఆధ్వర్యంలో పాతపంటల జాతర(జీవ వైవిధ్య) ఉత్సవాలను చేపట్టనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్లుగా జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జీవ వైవిధ్య జాతరను నిర్వహిస్తూ చిరుధాన్యాల సాగుపై రైతులు ఆసక్తి చూపేవిధంగా చైతన్యం చేస్తున్నామన్నారు. వాణిజ్య పంటలను సాగుచేసే రైతులకు పాలకులు ప్రాధాన్యం కల్పిస్తుండడంతో చిరుధాన్యాలను సాగుచేసే రైతులను గుర్తించకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ ఏడాది శాస్త్రవేత్తలను, మేధావులను, అధికారులను, ప్రజాప్రతినిధులను జాతరలో పాల్గొనేలా కృషిచేస్తున్నామన్నారు. చిరుధాన్యాలకు మార్కెట్లో డిమాండ్ ఉన్నప్పటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో లభించడం లేదని చెప్పారు. డీడీఎస్ ఆధ్వర్యంలో జహీరాబాద్ ప్రాంతంలో 30 ఏళ్లుగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతోపాటు వాటి గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నెలరోజుల పాటు ఉత్సాహభరితంగా కొనసాగే జాతరలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ ఉద్యోగులు, జాతర నిర్వాహకులు జనరల్ నర్సమ్మ, మాణిక్యం, చుక్కమ్మ, లక్ష్మమ్మ, మొగులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

22 గ్రామాల్లో పాతపంటల జాతర

జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 12 వరకు 22 గ్రామాల్లో 24వ పాతపంటల జాతరను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా 14న మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామంలో ప్రాంభమవుతుందన్నారు. 16న సిద్దాపూర్, 17న గొట్టిగార్‌పల్లి, 18న శేఖాపూర్, 19న జంబ్గితండా, 20న లచ్చినాయక్‌తండా, 22న ఒంటెలగడ్డతండా, 23న జీడిగడ్డతండా, 25న ఉప్పర్‌పల్లితండా, 26న మన్నాపూర్, 27 జాంగారిబౌలితండా, 29న అర్జున్‌నాయక్‌తండా, మూడ్‌తండా, 31న జహీరాబాద్, ఫిబ్రవరి 1న అల్గోల్, 2న పోట్టిపల్లి, 3న రేజింతల్, 5న హుసెల్లి, గుంజోటి, 6న శంశల్లాపూర్, 7న వడ్డీ, 9న బిడెకన్న, 12న మాచ్నూర్‌లో జాతర ముగింపు ఉంటుందన్నారు. ఈ జాతర ఉత్సవాల్లో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్యాన్ బోల్తా, 400 కోళ్లు మృతి

● రూ.2 లక్షల నష్టం, ● రామాయంపేట పాత హైవేలో ఘటన



రామాయంపేటలో బోల్తా పడ్డ కోళ్ల వ్యాన్

రామాయంపేట, జనవరి 13: రామాయంపేట శివారు పాత హైవేలో కోళ్ల వ్యాన్ బోల్తాపడింది. ఈ ఘటనలో సుమారు 400 కోళ్లు చనిపోగా రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఇసన్నపల్లి శివారు పౌల్ట్రీఫామ్ నుంచి కోళ్లను వ్యాన్‌లో లోడ్ చేసుకుని హైదరాబాద్ తీసుకువెళ్తున్న క్రమంలో శనివారం అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో వ్యాన్‌లోని కోళ్లన్నీ మృత్యువాతపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా విషయం తెలుసుకున్న స్థానికులు చనిపోయిన కోళ్లను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్న పెద్ద కర్మ రోజే.. తమ్ముడి మృతి



ఖదీర్(ఫైల్)

పాపన్నపేట, జనవరి 13: అన్న పెద్ద కర్మ రోజే.. తమ్ముడు మృతిచెందాడు. పాపన్నపేట మండలం మల్లంపేటకు చెందిన గాండ్ల చోటిబీ, హుసం దంపతులకు యాదుల్, ఖదీర్(27), ఫర్హానా సంతానం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే తండ్రి హుసం మృతిచెందాడు. అప్పటి నుంచి తల్లి చోటిబీ పిల్లలను పెంచి పెద్దచేసింది. కూతురు ఫర్హానాను పొడ్చన్‌పల్లికి చెందిన నబీకి ఇచ్చి వివాహం చేసింది. రెండేళ్ల క్రితం నబీ కుటుంబసభ్యులతో సెల్ఫీ వీడియో తీసుకుంటూ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఫర్హానా కూడా తల్లి వద్దనే ఉంటుంది. కాగా పెద్ద కొడుకు యాదుల్ 40 రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఆయన 40 రోజుల కార్యక్రమం జరగాల్సి ఉన్నది. ఈ క్రమంలో బంధువులు ఇంటికి చేరుకుంటున్నారు. అదే సమయంలో చిన్న కుమారుడు ఖదీర్(27) కూడా గుండెపోటుతో మృతిచెందాడు. అన్న పెద్ద కర్మరోజే తమ్ముడు కూడా మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. మృతుడికి కొడుకు ఉన్నాడు. కాగా భార్య ప్రస్తుతం గర్భిణి. ఖదీర్ మృతి విషయం తెలుసుకున్న మిత్రులు, గ్రామస్థులు, నాయకులు కలిసి రూ.2.5 లక్షలను పోగుచేసి మృతుడి కుటుంబానికి అందజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యం



సాయికుమార్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, జనవరి 13: సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఓ వ్యక్తి శనివారం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎస్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మండలం అన్నారంకు చెందిన తలారి సాయికుమార్(25) ఈనెల 10న ఫిట్స్ రావడంతో బంధువులు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో సాయికుమార్ మూత్రానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని బంధువులు ఆస్పత్రి చుట్టుపక్కల, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎటువంటి జాడ కనిపించలేదు. దీంతో సాయికుమార్ సోదరి భాగ్యలక్ష్మి సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

దుర్గాభవానీ ఆలయంలో హుండీ చోరీ



చోరీకి గురైన హుండీని పరిశీలిస్తున్న పోలీస్

కోహీర్ జనవరి 13: కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గల దుర్గాభవానీ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీని ఎత్తుకెళ్లారు. హుండీని ఎత్తుకెళ్లిన దుండగులు అందులోని నగదును తీసుకుని గ్రామ శివారులోని ఓ ప్రాంతంలో పారవేసి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. చోరీకి గురైన హుండీలో దాదాపు రూ.50 వేల వరకు నగదు ఉండొచ్చని పేర్కొన్నారు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న కోహీర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని క్రీడలకు వేదిక సిద్దిపేట: ఎమ్మెల్యే



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, జనవరి 13: సిద్దిపేట అన్ని క్రీడలకు నెలవుగా మారిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సాయంత్రం సిద్దిపేట అర్బన్ మండలం ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు, స్విమ్మింగ్ పోటీలు, వాలీబాల్ పోటీలకు సిద్దిపేట వేదికైందన్నారు. 15 రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు సిద్దిపేటలో టార్గెట్ బాల్ పోటీలు జరగడం గర్వంగా ఉన్నదని చెప్పారు. టార్గెట్ బాల్ అసోసియేషన్ వారు సిద్దిపేటలో మొదటి యూత్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం, టార్గెట్ బాల్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు.

నేడే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ఫైనల్

● గజ్వేల్‌లో హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు

గజ్వేల్, జనవరి 13: గజ్వేల్‌లో నిర్వహిస్తున్న 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ క్రీడా పోటీలు గజ్వేల్ పట్టణంలో హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ క్రీడల సెమీఫైనల్స్ ఫైనల్స్ ఆదివారం జరుగనున్నాయి. నాకౌట్ దశలో మ్యాచ్‌లన్నీ టైట్‌గా సాగాయి. ఆదివారం ఉదయం బాలికల విభాగంలో నల్గొండ-వరంగల్, గద్వాల-నాగర్‌కర్నూలు, మేడ్చల్-జనగాం, ఆసిఫాబాద్-సూర్యాపేట, రంగారెడ్డి-మహబూబ్‌నగర్, హనుమకొండ-వనపర్తి, మహబూబాబాద్-సిద్దిపేట, నిజామాబాద్-కరీంనగర్‌లు తలపడనున్నాయి. వీటిలో గెలిచిన జట్లు సెమీస్‌లో గెలిచిన జట్లు ఫైనల్లో తలపడనున్నాయి. ఇక బాలుర విభాగంలో లీగ్ దశ నుంచి నాకౌట్ దశకు 16 జట్లు చేరుకున్నాయి. రంగారెడ్డి-నారాయణపేట, ఆదిలాబాద్-కరీంనగర్, సంగారెడ్డి-భూపాలపల్లి, కొత్తగూడెం-నాగర్‌కర్నూల్, నల్గొండ-మహబూబ్‌నగర్, యాదాద్రి-సూర్యాపేట, మెదక్-మేడ్చల్, ఖమ్మం-గద్వాల్‌లు ఆదివారం ఉదయం తలపడనున్నాయి. ఈ నాకౌట్‌లో గెలిచిన జట్లు సెమీస్‌లో, సెమీస్‌లో గెలిచిన రెండు జట్లు ఫైనల్లో తలపడనున్నాయి.

అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం

● వర్గల్, నాచగిరి ఆలయాల్లో నిర్వహణ



నాచగిరి క్షేత్రంలోని ఈరాబాయమ్మ తోటలో గోదాదేవి రంగనాయక స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వర్గల్, జనవరి 13: జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన వర్గల్ మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం, వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవం సందర్భంగా గోదాదేవి రంగనాయకస్వామివారి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దేవాదాయ శాఖ ఆలయ కార్య నిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో ఉదయం 10.30 గంటలకు దేవతామూర్తులైన గోదాదేవి రంగనాయకస్వామివారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్యన ఊరేగింపు నిర్వహించి ఆలయ సమీపంలోని ఈరాబాయమ్మ తోటలో సర్వాంగ సుందరంగా అలంకరింపజేసిన కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోశ్చరణల మధ్య దేవతామూర్తులకు కల్యాణం నిర్వహించారు. అలాగే వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో వేదపండితులు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో గోదాదేవి రంగానాయక స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకలు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

● సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అజయ్‌గుప్తా ● చాట్లపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



చాట్లపల్లిలో వికసిత్ భారత్‌లో సంలక్ప్సయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అజయ్‌గుప్తా అన్నారు. శనివారం మండలంలోని చాట్లపల్లి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సంయుక్తాధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్లను, మండల సమాఖ్యకు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అజయ్‌గుప్తా, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుతున్నాయో.. లేదో అని సంకల్పయాత్ర ద్వారా తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డీఆర్డీఏ పీడీ జయదేవ్, డీఏవో శివప్రసాద్, డీఎంహెచ్‌వో కాశీనాథ్, సర్పంచ్ నరేష్, ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ కావ్యాదర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



మార్క్‌ఫెడ్ గోదాములను తనిఖీ చేస్తున్న డీఏవో శివప్రసాద్

మార్క్‌ఫెడ్ ఎరువుల గోదాములను తనిఖీ చేసిన డీఏవో

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 13: సిద్దిపేట పట్టణంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను, వ్యవసాయ మార్కెట్ కమిటీలో గల మార్క్‌ఫెడ్ ఎరువుల గోదాములను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువులను అధిక ధరలకు విక్రయించవద్దని, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని, ఎరువుల నిల్వలను రోజు వారీగా నమోదు చేయాలని ఆయన సూచించారు. యూరియా కోసం వచ్చే రైతులకు ఎలాంటి ఇతర ఎరువులు లింకు పెట్టొద్దని, అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ యాసంగి పంట కాలానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. యూరియాను మోతాదుకు మించి వాడొద్దని రైతులను కోరారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పరశురాం రెడ్డి, మార్క్‌ఫెడ్ ప్రతినిధులు లక్ష్మణ్, రాజేష్, జిల్లా వ్యవసాయ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సుమన్ ఉన్నారు.

స్క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

గజ్వేల్, జనవరి 13: గజ్వేల్ పట్టణంలోని వివాదాస్పద సర్వే నెంబర్ 332 వక్ఫ్ స్థల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీనివాస్‌రెడ్డి, గుంటుకు రాజు, బిస్వామిలు హైకోర్టులో వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసిందని గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఫిర్యాదీదారు మహ్మద్ వహీద్ తెలిపారు. గజ్వేల్ పోలీసులు చేస్తున్న విచారణకు సహకరించాలని సదరు వ్యక్తులకు హైకోర్టు సూచించిందని, తమది ఆక్రమణ కాదని నిరూపించుకోవాలని ఆర్డర్‌లో పేర్కొన్నట్లు వహీద్ తెలిపారు.

చేర్యాల గురుకుల మహిళా కళాశాల.. అర్ధాంతరంగా తరలింపు

- ఇక్కడ సొంత భవనముండగా మిట్టపల్లిలోని అద్దెభవనంలోకి మార్పు
- వెల్లువెత్తుతున్న అనుమానాలు
- చేర్యాలలోనే కొనసాగించాలని డిమాండ్

చేర్యాల, జనవరి 13 : చేర్యాల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనంలో 2017 నుంచి కొనసాగుతున్న సిద్దిపేట సాంఘిక, సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల తరలిపోయింది. ఆరేళ్లుగా భవనాన్ని వినియోగించుకున్న సంబంధిత అధికారులు ప్రస్తుతం ఇతర నియోజకవర్గ కళాశాల పేరిట ఎలాంటి షిఫ్టింగ్ ఆర్డర్స్ లేకున్నా అర్ధాంతరంగా తరలించుకుపోవడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే..

చేర్యాలకు ఆస్తిత్వంగా గురుకుల డిగ్రీ కళాశాల

గతంలో చేర్యాలలో బీసీ బాలుర, రెండు ఎస్సీ విద్యార్థుల వసతిగృహాలు అరకొర వసతుల నడుమ కొనసాగుతున్న క్రమంలో ఒకేగూటికి తీసుకువచ్చేందుకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. కానీ స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. ఇదేక్రమంలో 2016 జూలైలో ప్రభుత్వం సిద్దిపేటకు మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను మంజూరు చేయడంతో సొంత భవనం లేక మెదక్‌లో కొన్నాళ్లపాటు నిర్వహించారు. కొన్ని నెలల తరువాత కొండపాక మండలంలో కొనసాగించారు. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉండటతో జనవరి 2017లో చేర్యాల భవనంలోకి చేర్చారు. దీంతో డిగ్రీ కళాశాలలో ఈ ప్రాంత విద్యార్థినులకు ప్రవేశాలు లభించాయి. దీంతో ఆస్తిత్వం కోల్పోయిన చేర్యాలకు ఈ కళాశాల విద్యాహారంగా నిలిచిందని స్థానికులు సంతోషపడుతున్న క్రమంలో ప్రస్తుతం కళాశాలను తరలించడం వివాదాస్పదంగా మారింది.





గురుకుల మహిళా డిగ్రీకళాశాల కొనసాగిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం, సామగ్రితో వెళ్లిపోతున్న విద్యార్థులు

అనుమానాలెన్నో...

సిద్దిపేట మండలం మిట్టపల్లిలో కళాశాల సొంతభవన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ ఇంతవరకు పనులు చేపట్టలేదు. అయినప్పటికీ ప్రస్తుతం అక్కడ అద్దె భవనంలోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకుని చేర్యాల నుంచి కళాశాలను తరలించడంలో అంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలలో పనిచేసే ఉద్యోగులు ఇతర ప్రాంతాల నుంచి వస్తుండటంతో పాటు పర్యవేక్షణ కోసం ఉన్నతాధికారులు చేర్యాలకు రావడానికి ఇష్టపడక తప్పుడు సంకేతాలతో కళాశాలను తరలించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

> **ఎలాంటి ఆర్డర్స్ రాలేదు.. ఆర్‌సీవో ఆదేశంతో తరలిస్తున్నాం**
>
> కళాశాలను షిఫ్ట్ చేయాలని అధికారికంగా ఎలాంటి ఆర్డర్స్ రాలేదు. కానీ ఆర్‌సీవో ఆదేశానుసారం తరలిస్తున్నాం. ఇతర నియోజకవర్గానికి చెందిన కళాశాల కావడంతోనే షిఫ్ట్ చేయాల్సి వస్తుంది. కళాశాలను ఎక్కడ నిర్వహించినా మేము పనిచేస్తాం. మా సౌలభ్యం కోసం తరలిస్తున్నారన్నది అవాస్తవం.
>
> - సుజాత, ప్రిన్సిపాల్

ఇక్కడే కొనసాగించాలంటూ ఆందోళన

సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు ఇచ్చిన క్రమంలో విద్యార్థులను మూట, ముల్లె సర్దుకుని ఇంటికి పంపిస్తున్నారు. సెలవుల అనంతరం మిట్టపల్లిలోని కళాశాలకు రావాలని అధ్యాపకులు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు తెలియజేశారు. శుక్రవారం కళాశాల నుంచి విద్యార్థులు వెళుతున్న విషయాన్ని గమనించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె అశోక్ తదితరులు ఆందోళన చేపట్టారు. సంబంధిత అధికారులతో మాట్లాడి డిగ్రీ కళాశాలను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాల కోసం భవనాన్ని కేటాయించడంతో స్థానిక విద్యార్థులు వసతికి నోచుకోక నానా తంటాలుపడ్డారని, కేవలం చేర్యాల ఆస్తిత్వాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో తరలించడం తగదని మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు చొరవ వహించి కళాశాలను ఇక్కడే కొనసాగించేలా చూడాలని కోరారు.



కళాశాలను చేర్యాలలోనే కొనసాగించాలని ఆందోళన చేపట్టిన సీపీఐ నాయకులు

పార్ట్ టైం జాబ్ పేరిట రూ.2లక్షలకు టోపీ

- సైబర్ నేరంపై బాధితురాలి ఫిర్యాదు

చేర్యాల, జనవరి 13: కొమురవెల్లి మండలకేంద్రానికి చెందిన ఓ యువతి పార్ట్ టైం జాబ్‌కోసం ప్రయత్నిస్తూ సైబర్ మోసగాడి వలకు చిక్కి మోసపోయింది. దఫాలవారీగా డబ్బులు పంపిస్తూ రూ.2.03లక్షలు పోగొట్టుకుంది. కొమురవెల్లి పోలీసులకు శనివారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. బీఈడీ చదివిన సదరు యువతి పార్ట్ టైం జాబ్‌కోసం కొద్దిరోజులుగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ల ద్వారా యత్నించింది. తన ఇన్‌స్టాగ్రామ్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేసింది. దీంతో జాబ్ విషయమై చాటింగ్ చేస్తూ 4ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతో రూ.1300 జమయ్యాయి. అనంతరం మూడుసార్లు రూ.1000 చొప్పున పంపించడంతో రూ.1300చొప్పున జమ కావడంతో నమ్మకం కలిగి వేలల్లో డబ్బులు పంపించసాగింది. గత డిసెంబరు 28 నుంచి జనవరి 1వ తేదీ వరకు మొత్తం రూ.2.03లక్షల వరకు పంపించింది. తీరా ఎలాంటి స్పందన రాకపోవడంతో 1930నంబరు కాల్ చేయడంతో రూ.61,270 ఫ్రీజ్ చేశారు. శనివారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ నాగరాజు వివరించారు.

గణతంత్ర వేడుకలకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధి ఎంపిక



నారదాసు ఈశ్వర్

అక్కన్నపేట, జనవరి 13: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధి నారదాసు ఈశ్వర్ ఎంపికయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రంలో వివిధ రంగాల్లో కృషి చేస్తున్న పలువురిని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగంలో మత్స్యకార, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటులో విశేషంగా కృషి చేస్తున్న ఈశ్వర్‌ను కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణతంత్ర వేడుకలకు ఎంపిక చేసింది. ఈ మేరకు గణతంత్ర వేడుకలకు హాజరుకావాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈశ్వర్‌కు ఆహ్వానం పంపింది. గణతంత్ర వేడుకలకు హాజరయ్యే అరుదైన అవకాశం లభించడం పట్ల గ్రామస్థులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

సిద్దిపేటలో మెల్విన్ జోన్స్‌కు నివాళి



విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేటరూరల్, జనవరి 13: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలు సిద్దిపేటలోని స్ఫూర్తి లయన్స్ క్లబ్ ప్రతినిధులు నిర్వహించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తాలో గల మెల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకరి ఆలోచన ప్రపంచ దేశాలలో అనేకమందికి సేవా కార్యక్రమాలకు మార్గదర్శిగా నిలిచాయని చెప్పారు. మెల్విన్ జోన్స్ ఆలోచన విధానాలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి లయన్స్ క్లబ్ అధ్యక్షులు సామల సత్యనారాయణ, మాజీ గవర్నర్ లయన్ మామిడాల శ్రీనివాస్, సోమ కైలాసపతి, మాజీ అధ్యక్షుడు సత్యానందం, లయన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

కొండపాక, జనవరి 13 : కుకునూరుపల్లి మండలం కోనాయిపల్లి గ్రామంలో దున్నపోతుల లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మిట్టపల్లి వసంత రుషి ఆమె కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి రూ. 6వేలతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన దున్నపోతుల అంజయ్య రూ.2వేలను అందజేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

జహీరాబాద్/తూప్రాన్, జనవరి 13: జహీరాబాద్ మండలంలోని రంజోల్‌కు చెందిన తలారి కిష్టయ్య(48) డిసెంబరు 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. శనివారం భార్య స్వరూప ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. అలాగే మండలంలోని తొట్టి తండాకు చెందిన రాథోడ్‌జైసింగ్(40) గతేడాది ఆగస్టు 1న జహీరాబాద్‌కని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. అతడి భార్య సుశీలబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామానికి చెందిన నవ్య కొంపెల్లిలోని చర్మాస్ షోరూంలో పనిచేస్తున్నది. ఈ నెల 10న తూప్రాన్ మార్కెట్ వెళ్తున్నట్లు పక్కింటికి చెందిన మహిళకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఆమె భర్త నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

స్టోన్‌క్రషర్‌ను తొలగించాలి

జిన్నారం, జనవరి 13: అసైన్డ్ భూమిలో స్టోన్‌క్రషర్ ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ మాదారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. శనివారం మాదారం కాంగ్రెస్ నాయకుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక క్రషర్ వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. మాదారం, కాజీపల్లి గ్రామాల శివారులో సర్వే నెంబర్ 145, 146, 210లో గల అసైన్డ్ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్ ఏర్పాటు చేశారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సత్యనారాయణ, క్రిష్ణ, నర్సింహ, లక్ష్మన్, రాకేష్, ఆంజనేయులు, సంతోష్, నర్సింగరావులు ఉన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



హుస్నాబాద్‌లో అయోధ్య అక్షింతలను తలపై పెట్టుకుని ఆలయానికి వస్తున్న చైర్‌పర్సన్ రజిత



గజ్వేల్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న అయోధ్య ట్రస్టు జిల్లా అధ్యక్షుడు నరేష్‌బాబు

హుస్నాబాద్, జనవరి 13 : హుస్నాబాద్ పట్టణంలోని 5వ వార్డులో శనివారం గడప గడపకూ అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, చిత్తారి పద్మ, జనగామ రత్నమాల, దొడ్డి శ్రీనివాస్, మాడిశెట్టి హేమలత, వెంకటేశ్, నిరుమాల్ల శ్రీనివాస్, పిల్లి తిరుపతి, నర్సయ్య, శేఖర్ తదితరులున్నారు.

గజ్వేల్ రూరల్: గజ్వేల్‌లో అయోధ్య ట్రస్టు జిల్లా అధ్యక్షులు, సామాజిక సమరత రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో కాషాయ జెండాలు, అక్షింతలకు పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.నరేంద్ర, డి.దశరథ్, లక్ష్మణ్,సంపత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సిద్దిపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మంతెన రాజనరేందర్, గుర్రాలగొంది బీఆర్ఎస్ కార్యకర్తలు

సిద్దిపేట టౌన్/నారాయణరావుపేట, జనవరి 13: సిద్దిపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు మంతెన రాజనరేందర్ కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుర్రాలగొంది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాసిని వెంకటరెడ్డి, బెజగం చంద్రశేఖర్ , మెరుపుల శ్రీనివాస్ గౌడ్, పటెన్ల రాజారాం, అబ్దుల్ గఫూర్, మట్టే సంజీవరెడ్డిలు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హనుమాన్ల కాడి కృష్ణారెడ్డి, నియోజకవర్గానికి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



చిన్నకోడూరు: గోనెపల్లిలో క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు



చంద్లాపూర్‌లో క్రికెట్ ఆడుతున్న వంశీధర్ రావు

చిన్నకోడూరు, జనవరి 13: యువతకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం సోషల్ మీడియాతో పిల్లలో క్రీడాస్ఫూర్తి లేకుండా పోతుందన్నారు. గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారులు ఎదగాలని, గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. మంచి ఆరోగ్యానికి, అలవాట్లకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, సర్పంచ్ స్వరూపఎల్లయ్య, ఎంపీటీసీ పద్మమల్లేశం, ఉప సర్పంచ్ షాదుల్లా, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

యువత క్రీడల్లో రాణించాలని కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మన్ (బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి) కల్వకుంట్ల వంశీధర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని చంద్లాపూర్‌లో గ్రామ మాజీ ఎంపీటీసీ ఎస్. మల్లయ్య జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న గ్రామస్థాయి క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్పాన్సర్ సూరగోని శ్రీనివాస్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో శ్రవణా నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామివారు

వర్గల్, జనవరి 13: వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. వేడుకల సందర్భంగా స్వామివారికి లక్ష తులసి పూజలు, పూలతో పూజ నిర్వహించారు. భక్తులు స్వామివారి దర్శనంతో పాటు క్షేత్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భోజన వసతిని కల్పించారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యమైనాయి.

ధనుర్మాస పూజలో మైనంపల్లి



స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

గజ్వేల్, జనవరి 13: గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు శనివారం దర్శించుకున్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వారితో కాంగ్రెస్ నాయకులు సర్దార్‌ఖాన్, మోహన్నగారి రాజు, మల్లారెడ్డి, జంగం రమేశ్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు. అదేవిధంగా శనివారం నిర్వహించిన శ్రీరంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వారితో పాక్స్ వైస్ చైర్మన్ రవిందర్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో ముగ్గుల పోటీలు



13వ వార్డులో ముగ్గులు వేస్తున్న మహిళలు

గజ్వేల్, జనవరి 13: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 13వ వార్డులో షెహనాజ్ సమీర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా ప్రథమ బహుమతి శ్రీజ, ద్వితీయ బహుమతి సాధన, తృతీయ బహుమతి భవాణీ, చందనలు సాధించారు. వారికి కౌన్సిలర్ షెహనాజ్ సమీర్ బహుమతులను అందజేశారు. 19వ వార్డులోని డీసీఎంఎస్ గోడౌన్ వద్ద వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీష ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమంగా ముగ్గులు వేసిన రూపకు ప్రథమ బహుమతి, జ్యోతికి ద్వితీయ, శైలజ, వర్షలకు తృతీయ బహుమతులను వార్డు కౌన్సిలర్ శిరీష అందజేశారు.

రామునిపట్ల వాసికి జాతీయ సేవారత్న పురస్కారం



రాజలింగంకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న బహుజన సాహిత్య అకాడమీ సభ్యులు

చిన్నకోడూరు, జనవరి 13: మండలంలోని రామునిపట్ల గ్రామానికి చెందిన న్యాయవాది, మాజీ సర్పంచ్ భర్త, సంఘ సేవకుడు వరుకోలు రాజలింగం జాతీయ సేవారత్న (2024) పురస్కారానికి ఎంపికైనట్లు శనివారం బహుజన సాహిత్య అకాడమీ ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో అవార్డుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఫిబ్రవరి 11న నిర్వహించనున్న బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో పురస్కారాన్ని అందించనున్నట్లు తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న 'బలగం' నారాయణ



మల్లన్న సన్నిధిలో నటుడు మురళీధర్

చేర్యాల/దుబ్బాక, జనవరి 13 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని శనివారం నటుడు, బలగం సినిమాలోని నారాయణ పాత్రధారి మురళీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ స్వామివారి ప్రసాదాన్ని అందించి ఆశీర్వదించారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు సనాది కరుణాకర్ ఉన్నారు. అంతకు ముందు దుబ్బాకలోని శ్రీబాలాజీ ఆలయంలో శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవంలో మురళీధర్ కుటుంబసమేతంగా కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.

పనులు సరే.. పర్యవేక్షణ ఏది?

- లింగాపూర్‌లో సీసీరోడ్డుకు క్యూరింగ్ చేయని కాంట్రాక్టర్



కట్టలు కట్టి నీళ్లు నింపకుండా వదిలేసిన సీసీ రోడ్డు

మద్దూరు, జనవరి 13 : దూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో ఉపాధి హామీ పథకంలో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వాటర్ క్యూరింగ్ చేపట్టడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నా సంబంధిత శాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై శనివారం మండల కాంగ్రెస్ నాయకులు గద్దల మహేందర్ సీసీ రోడ్డునిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు రూ. 30 లక్షలు మంజూరయ్యాయన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం పనులు చేపట్టకుండా ఓ కాంట్రాక్టర్‌కు ఏఈ సూచనల మేరకు అప్పగించారని తెలిపారు. అయితే కాంట్రాక్టర్ నీటి క్యూరింగ్ కోసం కేవలం కట్టలు కట్టి నీళ్లను నింపకుండా అలాగే వదిలేశాడని మండిపడ్డారు. నీటి క్యూరింగ్ లేకపోవడంతో లక్షలు వెచ్చించి చేపట్టి ప్రజాధనం వృధాగా మారే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నీటి క్యూరింగ్ చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడి మృతి



భిక్షపతి (ఫైల్)

తొగుట, జనవరి 13: మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామంలో శుక్రవారం రాత్రి గుండెపోటుతో గ్రామపంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కుటుంబీకుల, గ్రామస్థుల వివరాల ప్రకారం. భిక్షపతి(56) శుక్రవారం ఎప్పటిలాగే గ్రామపంచాయతీ విధులు ముగించుకుని ఇంటికి వచ్చి రాత్రి తిని పడుకున్నాడు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతిచెందాడు. మృతుడికి భార్య మల్లవ్వ, కొడుకు మల్లేశం ఉన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

నారాయణరావుపేట, జనవరి 13 : ఇటీవల మండలంలో గోపులాపూర్, కోదండరావుపల్లి గ్రామాల్లో మరణించిన వారి కుటుంబాలను శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గోపులాపూర్ గ్రామం పార్టీ సీనియర్ నాయకురాలు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మోతె హన్మవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. హన్మవ్వ మరణం పార్టీకి తీరని లోటు అని, పార్టీకి ఆమె అందించిన సేవలను కొనియాడారు. అదేవిధంగా కోదండరావుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు లోకేష్‌రెడ్డి, వంశీరెడ్డిలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. శోక సంద్రంలో ఉన్న తల్లి తండ్రులను, కుటుంబాన్ని ఓదార్చారు. అధైర్య పడొద్దు, అండగా ఉంటానని భరోసా నిచ్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ శర్మ, ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు: మండలంలోని ఓబులాపూర్ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ముచ్చర్ల సతీష్ తండ్రి భూపతి (72), శంకరాయకుంటకు చెందిన వార్డు సభ్యుడు నగరం రాజు తండ్రి మల్లయ్య (68), చిన్నకోడూరు మండల మాచాపూర్ గ్రామానికి చెందిన సుంచు బాబు (36) ఇటీవల మృతి చెందారు. శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.